# ప్రజాస్వామిక, లౌకికవాద విలువలకై పోరాడుదాం!

**భారత** రాజ్యాంగం భారతదేశాన్ని లౌకికమైనదిగా నిర్వచించి నప్పటికీ, నిజమైన అర్థంలో లౌకికవాదాన్ని దేశ రాజకీయాలు ఎన్నడూ అనుమతించలేదు. పాలకవర్గ పార్టీల హీన ప్రయోజనాలకనుగుణంగా అది ఎప్పటికి తగ్గట్టు అప్పుడు పునర్నిర్వచించబడుతూ, అమలుచేయ బడుతోంది. అది అన్ని మతాలకు సమదూరంగాను, తటస్థంగాను ఉండటంలేదు. అన్ని మతాలను అది ఆమోదించటంలేదు. లౌకికవాదమంటే రాజ్యవ్యవహారాలన్నింటా మతాలకు దూరంగా ఉండటం. భారత పాలకవర్గాలు, వాటి రాజకీయ ప్రతినిధులు ఈ ప్రజాస్వామిక విలువను ఏనాడూ ప్రోత్సహించలేదు సరికదా, తమ రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా మతాన్ని ఉపయోగించటంలో తలమునకలై ఉన్నారు.

రామమందిర భూమిపూజ సందర్భంగా ఇది మరోమారు ముందుకి వచ్చింది. అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లోను మెజారిటీ మతస్తుల సంప్రదాయాలు అమలు చేయబడుతున్నాయి. తక్కువ సందర్భాల్లో మైనారిటీ మతస్తుల సంప్రదాయాలు అమలుచేస్తున్నారు. భారత సాంప్రదాయాలపేరిట జరిగే ఈ విధానాలన్నీ లౌకికవాదానికి వ్యతిరేకమైనవే. దీనినే ప్రధానమంత్రి నరేంద్రమోడీ కొనసాగిస్తూ భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఇది లౌకిక విలువలకు, ప్రజాతంత్ర ఆచరణకు విరుద్ధమైనది.

నరేంద్రమోడీ చేసిన ఈ భూమిపూజలో అనేక ప్రమాదకర విషయాలున్నాయి. బాబ్రీ మసీదును కూల్చివేసిన చోట శంకుస్థాపన చేయటం సుప్రీంకోర్టు తీర్పు అమలుచేయటంగా ప్రకటించుకున్నారు. రామమందిర నిర్మాణానికి అనుమతినిచ్చిన అదే కోర్టు బాబ్రీ మసీదు కూల్చివేతను అత్యంత అరాచకమైన నేరపూరిత చర్యగా కూడా పేర్కొంది. రాజ్యాంగబద్ధ సంస్థలకు ఎన్నికైనవారెవరైనా బాబ్రీ మసీదు కూల్చివేత నేరానికి పాల్పడ్డవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ, బాబ్రీ మసీదును విధ్వంసం చేసిన మూకకు నాయకత్వం వహించిన, రథయాత్ర సందర్భంగాను, బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం జరిగిన మారణహోమంలోను వేలాదిమంది అమాయకుల ప్రాణాలు పోవటానికి కారణమైన అద్వానీని పొగుడుతూ మోడీ శంకుస్థాపన చేశాడు. 2002లో గుజరాత్ ప్రభుత్వాధినేతగా ముస్లింలను ఊచకోత కోసిన వ్యక్తి, దానికి భిన్నంగా ప్రజాస్వామిక విలువలతో ఉంటాడని ఎవరైనా అనుకోగలరా!

అదే తీర్పులో సుప్రీంకోర్టు రామమందిర నిర్మాణాన్ని ఒక ట్రస్టుకి అప్పగించింది. తన రాజకీయ ప్రయోజనాలకనుగుణంగా బిజెపి దానిని తన చేతుల్లోకి తీసుకుని, శంకుస్థాపన చేయటానికి ఆగస్టు 5వ తేదీని ఎంచుకుంది. జమ్ముకాశ్మీర్‌కున్న రాజ్యాంగ ప్రతిపత్తిని తొలగించి దానిని సైనిక పాలనలో ఉంచిన సరిగ్గా సంవత్సరానికి ఈ చర్యకు పూనుకుంది. శంకరాచార్యతో సహా అనేకమంది హిందూమతాధిపతులు ఆరోజు మంచిదికాదని వ్యతిరేకించినా వాటన్నింటినీ పక్కకు నెట్టేసి హిందూ ధర్మం మొత్తానికి తానే ప్రతినిధిగా రుజువు చేసుకోవాలని తాపత్రయ పడింది. ఏ హిందూ ధర్మ పరిరక్షణకైతే తానున్నానన్నట్లుగా బిజెపి చెప్పుకుంటోందో, దానికి భిన్నంగా హిందూ మతాన్ని ఒక సాధనం కింద దిగజార్చిన వైనం దీనితో తేటతెల్లమైంది.

కరోనా వైరస్‌ను అడ్డుకోలేని తమ వైఫల్యాన్ని వైరస్‌తో సహజీవనం చేయాల్సి ఉంటుందన్న ప్రకటనతో అంగీకరించిన మోడీ ప్రభుత్వం, అది దేశ నలుమూలలా విస్తరిస్తున్న సమయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్న సర్వవ్యాపిత సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం చాలా నేర్పుగా కరోనాపైకి నెట్టేసి, అదే అదునుగా సామ్రాజ్యవాదుల, బడా బూర్జువాల ప్రయోజనాలను నెరవేరుస్తూ, సంక్షోభ భారాలను ప్రజలపై మోపుతోంది. కరోనా కాటుకు గురవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించటంలో అత్యంత ఉదాశీనంగా ఉంటూ ప్రజలపైనే దాడులు చేస్తోంది. తమ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకే ఈ సమయంలో భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్థిక సంక్షోభం నుండి ఉత్పన్నమవుతున్న వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నమే ఇది.

ప్రజల న్యాయమైన పోరాటాలను అణచివేయటం, సామ్రాజ్యవాదులు ఈ దేశాన్ని సురక్షితంగా దోచుకునే వీలు కల్పించటం, బడా బూర్జువాల భూస్వాముల పరిపాలనను కొనసాగించటమన్న భారీ లక్ష్యాల కోసం ఈ సందర్భాన్ని ఉపయోగించుకుంటున్నారు. అర్థవలస, అర్థఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల సంఘటితశక్తిని దెబ్బతీయటానికి గత ఏడు దశాబ్దాలుగా మతతత్వాన్ని ఒక సాధనంగా పాలకులు ఉపయో గిస్తున్నారు. భారత పాలకవర్గాలు మత విద్వేషాలను రెచ్చగొట్టటానికి తమ ప్రతినిధి రాజకీయపార్టీల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతులు రెంటికీ పాల్పడుతున్నారు.

పలు శతాబ్దాలుగా కష్టజీవులైన ప్రజలు నిర్మించుకున్న లౌకిక విలువలను హిందూ మతతత్వశక్తులు విచ్ఛిన్నం చేయకుండా చూడాలని, వైద్యరంగంలోని నిపుణుల సలహాలను స్వీకరించాలని, బిజెపి, దాని అనుబంధ సంస్థలు తమ హీన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మత విశ్వాసాలను ఉపయోగించుకోనివ్వకుండా చూడాలని సి.పి.ఐ.(ఎం-ఎల్) కేంద్రకమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.

లౌకికవాదం కోసం పోరాడుదాం; ప్రజాస్వామ్యం కోసం పోరాడుదాం!

ఆర్థిక సమస్యలకు, సామాజిక అణచివేతలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజలను కదిలించండి!

*విప్లవాభివందనలతో....*

**విశ్వం,**

ప్రధానకార్యదర్శి

**సి.పి.ఐ.(ఎం-ఎల్)**

**విజయవాడ**

**5-8-2020**

ooo